తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

సోమవారం
16నవంబర్ 2026

పేజీలు : 08

Follow :



మాక్‌డోవెల్ కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన అజయ్ యాదవ్

రూ.10 లక్షలతో నిర్మాణం.. కాలనీ ప్రజలకు అందుబాటులోకి సౌకర్యం

బోడుప్పల్-జనంసాక్షి : బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బోడుప్పల్ డివిజన్ మాక్‌డోవెల్ కాలనీలో సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ బొమ్మక్ బాలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించి కాలనీ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ, కాలనీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కమ్యూనిటీ హాళ్లు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయ ని, వివాహాలు, శుభకార్యాలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకు నేందుకు ఈ భవనం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సౌకర్యాల కల్పనకు కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి రావడంతో కాలనీ ప్రజలకు కార్యక్ర మాల నిర్వహణలో సౌకర్యం కలగనుంది. ఈ కార్యక్రమంలో బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బొమ్మకు కళ్యాణ్ కుమార్, ఉపాధ్యక్షుడు పి. రవి, కాలనీ అధ్యక్షులు, కాలనీ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



ఎస్ఎల్ఎన్‌సీ కాలనీకి నూతన నాయకత్వ బృందం

- **కాలనీ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యం**
- **అధ్యక్షుడిగా రాజవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకట్ రెడ్డి**

బోడుప్పల్-జనంసాక్షి : ఎస్ఎల్ఎన్‌సీ కాలనీ అభివృద్ధి, నివాసితుల సంక్షేమం, కాలనీవాసుల మధ్య ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యంగా నూతన నాయకత్వ బృందం ఏర్పాటైంది. కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు, స్థానిక సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని నూతన కమిటీ నిర్ణయించింది. నూతన నాయకత్వ బృందం అధ్యక్షుడిగా రాజవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా గణేష్, కృష్ణ (పోలీస్), కోశాధికారిగా శ్రీపాల్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన నాయకత్వ బృందం కాలనీ అభివృద్ధికి నివాసితులందరి సహకారం ఎంతో అవసరమని పేర్కొంది. పరస్పర సమన్వయంతో ముందుకు సాగుతూ, కాలనీలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపింది. ముఖ్యంగా పరిశుభ్రత, భద్రత, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నివాసితులకు అవసరమైన వసతుల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించింది.

కాలనీవాసుల అభిప్రాయాలకు ప్రాధాన్య తనిస్తూ, అందరినీ కలుపుకొని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడమే తమ ప్రధాన ఉద్దేశమని నాయకత్వ బృందం స్పష్టం చేసింది. ఐక్యత, పరస్పర సహకారం, సమష్టి కృషితో ఎస్ఎల్ఎన్‌సీ కాలనీని ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొంది.

ఘనంగా బిర్సా ముండా 151వ జయంతి వేడుకలు

- **గిరిజన హక్కుల పరిరక్షణకు ఆయన పోరాటం స్ఫూర్తిదాయకం**
- **జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎన్. పద్మజ**



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 15 (జనంసాక్షి) : గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం భగవాన్ బిర్సా ముండా చేసిన పోరాటం చిరస్మరణీయమని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎన్.పద్మజ అన్నారు. జన జాతీయ గౌరవ దివస్‌ను పురస్కరించుకుని ఆదివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బిర్సా ముండా 151వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.పద్మజ మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ధీర యోధుడు బిర్సా ముండా అని కొనియాడారు. గిరిజనుల హక్కుల సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బిర్సా ముండా ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి వీడియో కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ముగిసిన 104వ మెథడిస్ట్ క్రిస్టియన్ జాతర

- **ఆశించిన స్థాయిలో రాని భక్తజనం.. గతేడాదితో పోలిస్తే తగ్గిన సందడి**
- **ఆరు రోజులు విజయవంతంగా నిర్వహణ**
- **వెండి, బంగారు సిలువలు, మేకలు, గొర్రెలు సమర్పించిన భక్తులు**
- **అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు.. దైవ సందేశంతో ముగిసిన వేడుకలు**

లోనికి వెళ్లండి

కీసర బీజేపీలో ఐదు మోర్చాలకు కొత్త సారథులు

- **గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ఏనుగు సుదర్శన్ రెడ్డి**



కీసర, నవంబర్ 15 (జనంసాక్షి) : కీసర డివిజన్‌లో భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ఐదు మోర్చాలకు నూతన అధ్యక్షులను నియమించారు. గ్రామగ్రామాన పార్టీని విస్తరిస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా పార్టీ ఆదేశాల మేరకు కీసర డివిజన్ అధ్యక్షుడు కోల బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ కార్యవర్గ సమావేశంలో ఈ నియామకాలు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏనుగు సుదర్శన్ రెడ్డి, విశిష్ట అతిథులు సింగిరెడ్డి వెంకట రెడ్డి, జిల్లాల తిరుమల్ రెడ్డి, కౌకుట్ల చంద్రారెడ్డి, బోడ శ్రీనివాసరావు నూతన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా కీసర డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా కామసాని ఉమారెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా తాళ్ల మల్లేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా పొట్ట ఆంజనేయులు కురుమ, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా అన్నోజిగూడ మల్లారెడ్డి, యువమోర్చా అధ్యక్షుడిగా బోయిని రాంబాబు ముదిరాజ్‌లను నియమించారు. అనంతరం కీసర డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కోల బాలరాజు యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతమే లక్ష్యంగా నూతన మోర్చా అధ్యక్షులు పనిచేయాలని, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు క్షేత్రస్థాయిలో పార్టీకి మరింత బలం చేకూర్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మెట్టు కృష్ణ యాదవ్, చిందం నగేష్, ఏలూరు సత్యనారాయణ, రాగుల అశోక్ ముదిరాజ్, కొలిచేలిమి కృష్ణ, దొబ్బల శ్రీశైలం, ఐలయ్య యాదవ్, కోల మహేందర్ యాదవ్, సత్యనారాయణ యాదవ్, నరసింహ చారి, రాజుగౌడ్, లింగం, ప్రభాకర్ రెడ్డి, సత్యం, రావుల ముత్యం, నవీన్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్, కృష్ణ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, మధు తదితర సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకే దిక్కులేదు.. ఇందిరమ్మ బీమాకు నిధులెక్కడ

- **కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతోంది**
- **బీఆర్ఎస్ నేత పడిగళ్ల అశోక్**



వికారాబాద్,నవంబర్ 15,(జనంసాక్షి): తెలంగాణలో కాంగ్రె స్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్, పడిగళ్ల అశోక్ విమర్శిం చారు. ఇప్పటికే రైతు బీమా, రైతు భరోసా వంటి పథకాలకు దిక్కులేని పరిస్థితి నెలకొందని, ఇప్పుడు ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రకటించడం వెనుక నిధులు ఎక్కడి నుంచి తీసుకొస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేసిన రైతు భరోసా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, గత రెండేళ్లుగా ప్రీమియం చెల్లించకుండా పథకాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కొత్త పథకాల ప్రకటనలతో ప్రజలను మభ్యపెట్టడం సరికాదన్నారు. హైదరాబాద్‌లో తాగునీరు, విద్యుత్ సమస్యలతో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతూ హాస్టళ్లను వదిలి వెళ్లే పరిస్థితులు ఉన్నాయని విమర్శించా రు. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ మెప్పు కోసం సుమారు రూ.100 కోట్ల వ్యయంతో హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్ నిర్వహించడం సిగ్గుచేటని అన్నారు. గాంధీ కుటుంబ సభ్యుల పేర్లతో తెలంగాణలో కొత్త పథకాలను ప్రవేశపెట్టడం, ఆ తర్వాత వాటి అమలును గాలికి వదిలేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రైతులకు భరోసా కల్పించ డం, ఇచ్చిన హామీలను అమలు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని పడిగళ్ల అశోక్ డిమాండ్ చేశారు.

అంగరంగ వైభవంగా ముగిసిన 104వ మెథడిస్ట్ క్రిస్టియన్ జాతర

- ఆశించిన స్థాయిలో రాని భక్తజనం.గతేడాదితో పోలిస్తే తగ్గిన సందడి
- ఆరు రోజులు విజయవంతంగా నిర్వహణ
- వెండి,బంగారు సిలువలు,మేకలు,గొర్రెలు సమర్పించిన భక్తులు
- అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు.దైవ సందేశంతో ముగిసిన వేడుకలు



ధారూర్,నవంబర్ 15(జనంసాక్షి) : వికారాబాద్ జిల్లా ధారూర్ మండలంలోని ప్రసిద్ధ 104వ మెథడిస్ట్ క్రిస్టియన్ జాతర ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ముగిశాయి.ఈ నెల మంగళవారం ప్రారంభమైన ఉత్సవాలు ఆరు రోజుల పాటు భక్తుల ప్రార్థనలు, ఆధ్యాత్మిక సందేశాలు,ప్రత్యేక కార్యక్రమాలతో కొనసాగి ఆదివారంతో ముగింపు పలికాయి.చివరి రోజు కూడా భక్తులు ఏసు ప్రభువు సిలువల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా జరిగే ఈ జాతరకు ఈసారి ఆశించిన స్థాయిలో భక్తులు తరలిరాకపోవడం చర్చనీయాంశంగా మారింది.గత ఏడాదితో పోలిస్తే ఈసారి భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు స్థానికులు, నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు ఉత్సవాల నిర్వహణలో అక్కడక్కడా అంతరాయాలు ఎదురైనప్పటికీ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడం విశేషంగా నిలిచింది.జాతర సందర్భంగా భక్తులు తమ మొక్కుల్లో భాగంగా వెండి సిలువలు,మేకలు, గొర్రెలను సమర్పించి భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.పలువురు భక్తులు సిలువల వద్ద పొర్లు దండాలు పెడుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాస్టర్లు దైవ సందేశాలను అందిస్తూ భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపారు.భజనలు, ప్రార్థన లు, దైవ వాక్యాలతో జాతర ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ఉత్సవాల విజయవంతమైన నిర్వహణలో పోలీసు, వైద్య,పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారు.భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పారిశుద్ధ్యం,తాగునీరు, వైద్య సేవలు,భద్రతా ఏర్పాట్లపై ఆయా శాఖలు పర్యవేక్షణ కొనసాగించాయి.ముఖ్యంగా పోలీసు శాఖ బందోబస్తు,వైద్య శాఖ సేవలు,మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ భక్తులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.మొత్తంగా కొన్ని అంతరాయాలు, భక్తుల సంఖ్య తగ్గుదల వంటి పరిణామాలు కనిపించినప్పటికీ 104వ మెథడిస్ట్ క్రిస్టియన్ ఉత్సవాలు భక్తుల ప్రార్థనలు,మొక్కులు,దైవ సందేశాల నడుమ ఘనంగా ముగిశాయి. మరో ఏడాది పాటు ఈ ఆధ్యాత్మిక వేడుకల జ్ఞాపకాలను మదిలో నింపుకుని భక్తులు తమ స్వస్థలాలకు తిరుగుముఖం పట్టారు.



ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ సెక్రటరీగా వెంకట్ మేడిశెట్టికి బాధ్యతలు

నాపై నమ్మకం ఉంచిన నాయకులకు కృతజ్ఞతలు - వెంకట్ మేడిశెట్టి

బోడుప్పల్-జనంసాక్షి : తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ సెక్రటరీగా తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, పొలిటికల్ చైర్మన్ ఆగిరి వెంకటేష్‌కు బోడుప్పల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకట్ మేడిశెట్టి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి కీలకమైన బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకట్ మేడిశెట్టి మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతలను పదవిగా కాకుండా ఆర్యవైశ్య సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశంగా భావిస్తున్నానని తెలిపారు. నాయకులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఆర్యవైశ్య సమాజ అభ్యున్నతికి, సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. అలాగే, ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, రాజకీయ రంగంలో సమాజానికి తగిన ప్రాతినిధ్యం లభించేలా తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర నాయకత్వానికి మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు

- మక్త వెంకటాపూర్‌లో గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న పీఏసీఎస్ వైస్ చైర్మన్ అశోక్ కుమార్



చౌదాపూర్, నవంబర్ 15 (జనం సాక్షి): చౌదాపూర్ మండలం మక్త వెంకటాపూర్ గ్రామంలో కత్రావత్ మిట్లీభాయ్ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కుల్కచర్ల-చౌదాపూర్ మండలాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్ హాజరై, నూతన గృహంలోకి ప్రవేశించిన కుటుంబ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించి పక్కా ఇళ్ల నిర్మాణానికి తోడ్పాటునిస్తోందని తెలిపారు. ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది ఆత్మగౌరవానికి, భద్రతకు ప్రతీక అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడి ప్రతి కుటుంబానికి సొంతింటి భరోసా కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి తండా సర్పంచ్ గుండియా, మాజీ సర్పంచ్ వెంకట్, వార్డు మెంబర్ సూర్య నాయక్, బుద్ద నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు సంతోష్ నాయక్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రామారావు, లాలు, అంజు, లక్ష్మణ్ నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కింద వంటలు.. పైన విద్యార్థులకు చదువులు!

షేక్‌పేట, నవంబర్ 15 (జనంసాక్షి): పుప్పాలగూడ-నార్సింగి ప్రధాన రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా, కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిర్వహిస్తున్న అలెన్ విద్యాసంస్థపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ ఎన్. మల్లికార్జున్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే తనిఖీలు చేపట్టాలని కోరారు.



- పుప్పాలగూడలోని అలెన్ విద్యాసంస్థపై తక్షణమే చర్యలు తీసుకోవాలి
- ప్రమాదాలు జరగకముందే విద్యాశాఖ, ఫైర్ సేఫ్టీ అధికారులు స్పందించాలి
- ఎన్. మల్లికార్జున్, జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయ కమిషన్ రాష్ట్ర చైర్మన్

వాణిజ్య భవనంలో విద్యాసంస్థ

పుప్పాలగూడలోని ఓ కమర్షియల్ కాంప్లెక్స్‌లో విద్యాసంస్థ నిర్వహ ణపై స్పష్టత లేదని మల్లికార్జున్ పేర్కొన్నారు. పాఠశాలనా, కోచింగ్ సెంటరా అనే వివరాలు వెల్లడించకుండా కేవలం అలెన్ బోర్డుతో కార్యకలాపాలు సాగిస్తున్నారని ఆరోపించారు. విద్యాసంస్థల నిర్వహణ కు అవసరమైన అనుమతులు, భవన ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో అధికారులు పరిశీలించాలని కోరారు.

కింద హోటళ్లు.. పైన కోచింగ్ తరగతులు

భవనం కింది అంతస్తులో హోటళ్లు, ఫుడ్ అవుట్‌లెట్లు నిర్వహిస్తుండగా, పై అంతస్తుల్లో నీట్, ఐఐటీ కోచింగ్ పేరుతో వందలాది మంది విద్యార్థులకు తరగతులు నిర్వహించడం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. వంటశాలల నుంచి అగ్నిప్రమాదం సంభవిస్తే పై అంతస్తుల్లోని విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు.

అగ్నిమాపక భద్రతపై ఆందోళన

భవనంలో తగిన అగ్నిమాపక పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఉన్నాయో లేదో తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇలాంటి భవనాల్లో జరిగిన అగ్నిప్రమాదాల ఘటనలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

కనీస మౌలిక సదుపాయాలు, ఫైర్ సేఫ్టీ అనుమతులు ఉన్నాయో లేదో పరిశీలించకుండా విద్యాసంస్థ నిర్వహణ ఎలా సాగుతోందని ప్రశ్నించారు. ఎంఈవో, డీఈవో అధికారులు ఈ అంశంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించకుండా ముందుగానే తనిఖీలు నిర్వహించి, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కొమ్ము వెంకన్నబాబు, చిలువేరు రమణారెడ్డి, భాస్కర్ పటేల్, శ్రీకాంత్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కేశ్వపూర్ లో ఉచిత వైద్య శిభిరం నిర్వహించడం అభినందనీయం : కౌన్సిలర్ గోవర్ధన్



శామీర్ పేట్, నవంబర్ 15(జనం సాక్షి) : విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా మూడు చింతలపల్లి మండలం కేశ్వా పూర్ గ్రామంలో ఆదివారం ఆర్ఎక్స్ హాస్పిటల్ (తూముకుంట) వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కౌన్సిలర్ గోవర్ధన్ రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం, షుగర్‌తో పాటు పలు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్యులు సూచించిన మందులను ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పై శ్రద్ధ వహిస్తూ ఇలాంటి వైద్య శిబిరాలను సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ నిర్వాహకులు డాక్టర్ ఎన్. శశిధర్, వైద్యులు పాల్గొన్నారు.

కోటి దీపోత్సవంలో వైభవంగా రెండో రోజు వేడుకలు



ముషీరాబాద్, నవంబర్ 15 (జనం సాక్షి): హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం రెండో రోజు వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. శంఖారావం, వేద పఠనంతో ప్రారంభమైన కార్యక్రమాల్లో మహాశివలింగానికి ప్రదోషకాల అభిషేకం, భక్తిగీతాలు, ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. డా. తాడేపల్లి పతంజలి శాస్త్రి ఆధ్యాత్మిక ప్రవచనం చేయగా, శివశ్రీ స్కందప్రసాద్ భజన గీతాలు ఆలపించారు. అనంతరం సుబ్రహ్మణ్య వేలాయుధ కావడి పూజ, తిరుచెందూరు శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రాలయ పీఠాధిపతి శ్రీ సుబుదీంద్రతీర్థ స్వామివారు, హరికృపాధాం పీఠాధిపతి హరిచైతన్యపురి మహారాజ్, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. సురేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉత్సవాల్లో భాగంగా బంగారు శివలింగం వద్ద 108 మందితో పంచహారతులు నిర్వహించగా, తిరుచెందూరు ఉత్సవమూర్తుల పల్లకి ఊరేగింపు కనులపండువగా సాగింది. అనంతరం పీఠాధిపతులు, అతిథులు, భక్తులు సామూహిక కార్తిక దీపారాధనలో పాల్గొని దీపాలు వెలిగించారు. లింగోద్భవం, సప్తహారతి, మహానీరాజనం, మహామంగళహారతి కార్యక్రమాలతో రెండో రోజు కోటి దీపోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి.

హెలెన్ కెల్లర్స్ ఇన్ ట్యూట్‌లోబధిర పూర్వ విద్యార్థుల సమ్మేళనం





మల్కాజిగిరి నవంబర్ 15 (జనం సాక్షి) వైకల్యం విజయానికి అడ్డు కాదని ఆత్మవిశ్వాసంతో పోటీపడుతూ దివ్యాంగులు అన్ని రంగాలలో రాణించాలని హెలెన్ కిల్లర్ ఇన్ ట్యూట్ చైర్మన్ పఠాన్ ఉమర్ ఖాన్ పేర్కొన్నారు .ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ సాంబమూర్తి నగర్‌లో 1954లో స్థాపించిన ప్రభుత్వ బధిరుల ఉన్నత పాఠశాల 72వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్ నగరంలోని నేరెడ్ మెట్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అంగరంగ వైభవంగా జరిగింది. హెలెన్ కెల్లర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్ ఫర్ ది డిసేబుల్డ్ చిల్డ్రన్ సంస్థ ప్రాంగణంలో, ఆ సంస్థ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ లయన్ పఠాన్ ఉమర్ ఖాన్ ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పఠాన్ ఉమర్ ఖాన్ మాట్లాడుతూ, వినికిడి లోపం ఉన్న పిల్లలకు కేవలం అక్షర జ్ఞానం అందించడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసం నింపి సమాజంలో గౌరవంగా జీవించేలా తీర్చిదిద్దడం అందరి బాధ్యత అన్నారు. పట్టుదల, సరైన మార్గదర్శకత్వం ఉంటే దివ్యాంగులు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు తమ పాఠశాలతో నిరంతర అనుబంధాన్ని కొనసాగిస్తూ ప్రస్తుత తరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.విశిష్ట అతిథిగా హాజరైన కాకినాడ ప్రభుత్వ బధిరుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి డేవిడ్ మాట్లాడుతూ, వినికిడి లోపం ఉన్న విద్యార్థులు నేడు విద్య, క్రీడలు, సామాజిక రంగాల్లో రాణిస్తుండటం అభినందనీయమన్నారు. వైకల్యం విజయానికి అడ్డంకి కాదని, సమాజం వారికి తగిన అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలని కోరారు .కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు వారికి అర్థమయ్యే భాషలో ఆత్మీయంగా పలకరించుకున్నారు. వినికిడి, మాటల లోపం ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో పోటీపడుతూ స్వశక్తితో ఎదగాలని పిలుపునిచ్చారు. 72 ఏళ్లుగా వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన తమ విద్యాసంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జ్ఞాపికలను అందజేసి సన్మానం చేశారు. ఈ సమ్మేళనం విజయవంతం కావడంలో నిర్వాహకులు ఏ.శ్రీనివాస్, ఎస్.వి.శర్మ, ఎన్.ఎన్.రాజు, వి.ఎస్.ఎన్.మూర్తి, లక్ష్మీ ప్రసన్న, జి.పి.కె.రెడ్డి, శిరీష, రమాదేవి, డి.సుబ్బరాజు, పి.వి.సూర్యనారాయణ, శ్రీనివాసరావు, జి.కె.దుర్గారావు, కె.శ్రీనివాసరావు తదితరులు కీలక పాత్ర పోషించారు.

మహిళల ఆత్మరక్షణకు తైక్వాండో ఎంతో దోహదం

సూపర్ పవర్ తైక్వాండో అకాడమీ మాస్టర్ సుబ్రమణ్యం



ముషీరాబాద్, నవంబర్ 15 (జనం సాక్షి):మహిళలు ఆత్మరక్షణ కోసం తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్‌ను తప్పనిసరిగా నేర్చుకోవాలని సూపర్ పవర్ తైక్వాండో అకాడమీ మాస్టర్ సుబ్రమణ్యం సూచించారు. మారుతున్న పరిస్థితుల్లో మహిళలు, బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడంతో పాటు, ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునే నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం బాగ్‌లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వెనుక కమ్యూనిటీ హాల్‌లో సూపర్ పవర్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 50 మంది విద్యార్థులకు కలర్ బెల్ట్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన తైక్వాండో విన్యాసాలు, మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ స్థాయిల్లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాస్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. తైక్వాండో కేవలం క్రీడ మాత్రమే కాదని, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే గొప్ప సాధనమని అన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందడం ద్వారా ఆపద సమయాల్లో ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని పొందుతారని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో రాణించడంతో పాటు చదువులోనూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కలర్ బెల్ట్ సర్టిఫికెట్లు, బెల్టులు అందుకున్న విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినర్ సంజయ్, అబ్జర్వర్ ఇర్ఫాన్, కోచ్‌లు జీవీ కార్తీక్, సంజన, నిలయ, మోక్షిత, వినయ్, మనస్విన్ తదితరులతో పాటు విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తాండూరుకు అంతర్జాతీయ గుర్తింపు

శంకర్ యాదవ్‌కు అంతర్జాతీయ సేవారత్న అవార్డు



తాండూరు నవంబర్ 15(జనంసాక్షి)న్యూఢిల్లీలో ప్రముఖుల సమక్షంలో సేవారత్న ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్న శ్రీ సాయిపుత్రా హోమ్స్ అండ్ డెవలపర్స్ అధినేత బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి తాండూరుకు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త, శ్రీ సాయిపుత్రా హోమ్స్ అండ్ డెవలపర్స్ అధినేత శంకర్ యాదవ్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రతిష్ఠాత్మకమైన సేవారత్న ఇంటర్నేషనల్ అవార్డు'ను అందజేసి ఘనంగా సత్కరించారు. ఆదివారం న్యూఢిల్లీలో ప్రముఖుల సమక్షంలో ఆయన ఈ అవార్డును స్వీకరించారు.ఈ సందర్భంగా శంకర్ యాదవ్ మాట్లాడుతూ భగవంతుడు తనను తాండూరు ప్రాంతంలో జన్మింప జేసినందుకు ఎంతో గర్విస్తున్నానని పేర్కొన్నారు. గత పదిహేను సంవత్సరాలుగా తాండూరు ప్రాంత ప్రజలకు తన వంతు సహకారం అందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం తనకు ఎంతో తృప్తినిస్తోందని అన్నారు. తాను చేస్తున్న సేవలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ అంతర్జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక చేయడం పట్ల నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అవార్డు తనకు ఎంతో ఆనందాన్ని, గౌరవాన్ని ఇచ్చిందని, అదే సమయంలో సమాజం పట్ల తనపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు.తాండూరు ప్రాంతానికి చెందిన వ్యక్తిగా న్యూఢిల్లీ వేదికపై ప్రత్యేక అతిథిగా పాల్గొనడంతో పాటు అంతర్జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకోవడం గర్వంగా ఉందని ఆయన తెలిపారు. ఈ గుర్తింపు భవిష్యత్తులో ప్రజలకు మరింత బాధ్యతతో సేవలందించేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని అన్నారు.అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని అభినందించారు. ప్రతిభను, సేవాభావాన్ని గుర్తించి అంతర్జాతీయ వేదికపై గౌరవించడం ద్వారా మరింత మందికి స్ఫూర్తినిచ్చేలా బహుజన సాహిత్య అకాడమీ చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

గబ్బిలాలపేట సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టాలని కాలనీవాసుల వినతి



జవహర్ నగర్: నవంబర్ 15: (జనంసాక్షి):కాలనీల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ తెలిపారు.జవహర్ నగర్ పరిధిలోని గబ్బిలాలపేట కాలనీవాసులు చెన్నాపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.కాలనీవాసుల సమస్యలను పరిశీలించిన శాంతి కోటేష్ గౌడ్, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.ఎస్. వెంకటేశ్వర్, మాజీ కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్, అధికార ప్రతినిధి ఆకుల ప్రభాకర్ గౌడ్, నాయకులు వీర్ల భుజంగం, అర్జున్, కాలనీవాసులు పాల్గొన్నారు.

రామంతాపూర్ చిన్న చెరువు వద్ద ఛఠ్ పూజ

పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ / రామంతాపూర్, నవంబర్ 15 (జనం సాక్షి): రామంతాపూర్ డివిజన్ పరిధిలోని చిన్న చెరువు వద్ద ఉత్తర భారతీయుల సంప్రదాయ ఆధ్యాత్మిక పండుగ ఛఠ్ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సూర్య భగవానుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రకృతికి, సూర్య భగవానుడికి కృతజ్ఞతలు తెలిపే గొప్ప ఆధ్యాత్మిక పండుగ ఛఠ్ పూజ అని పేర్కొన్నారు. భక్తులు నియమనిష్ఠలతో ఉపవాస దీక్షలు చేపట్టి సూర్య భగవానుడిని ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.ఉప్పల్ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాలు, భాషలు, సంస్కృతులకు చెందిన ప్రజలు అన్ని పండుగలను ఐకమత్యంతో జరుపుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. భిన్న సంస్కృతులు ఉన్నప్పటికీ అందరూ కలిసిమెలిసి ఉండటమే సమాజ ఐక్యతకు నిదర్శనమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఛఠ్ పూజ నిర్వాహకులు, స్థానిక నాయకులు, ఉత్తర భారతీయ సోదరులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గురునానక్ దేవ్ జయంతి వేడుకల్లో మాజీ కార్పొరేటర్ శాంతి



అల్వాల్, నవంబర్ 15 (జనంసాక్షి): సిక్కుల ఆరాధ్య దైవం గురునానక్ దేవ్ జీ 557వ జయంతి వేడుకలను పురస్కరించుకుని అల్వాల్‌లోని గురుద్వారాలో సిక్కుల సంఘం ఆధ్వర్యంలో ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.సిక్కు మతంలో అత్యంత పవిత్రమైన పండుగగా భావించే గురునానక్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా భక్తులు భారీ ఊరేగింపులు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో సిక్కు మత పెద్దలు, నాయకులు ప్రేమ్‌కుమార్, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే



మల్కాజిగిరి నవంబర్ 15 (జనం సాక్షి)ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వినాయకనగర్, కాకతీయనగర్ డివిజన్లకు చెందిన పలువురు బాధితులకు ఆయన సీఎంఆర్ఎఫ్ ఎల్ ఓసి పత్రాలను అందజేశారు.అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడుతుందని అన్నారు. ఎం.నరసింహ 3,90,000, మహిపాల్ 2,70,000, ఎస్.శైలజ 60,000,కె.అశోక్ 30,000, సోమయ్య 11,000, సకాలంలో స్పందించి, తమ కుటుంబాలకు ఆర్థిక ఆసరా కల్పించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుత్తి రాంచందర్, తులసి సురేష్, హేమంత్, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ మాలి శివకుమార్ రెడ్డి



దోమ నవంబర్ 15 జనం సాక్షి.దోమ మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ మాలి శివకుమార్ రెడ్డి. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ బ్యాంక్ చైర్మన్ యాదవ రెడ్డి, సొసైటీ బ్యాంక్ సిఈఓ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జాకటి వెంకటయ్య, మమ్మద్ గౌస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాంత కుమార్, వార్డు మెంబర్ చాకలి వెంకటేష్, భీమయ్య, ఉప సర్పంచ్ భర్త రమేష్, బాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్, నిరంజన్ రెడ్డి, సత్తి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన తిరుపతిరెడ్డి



కొడంగల్, నవంబర్ 15 (జనం సాక్షి): కొడంగల్ మండలం అంగడి రాయిచూరు అనుబంధ గ్రామం ధర్మాపూర్ పట్లోళ్ల చిన్నారెడ్డి కుమారుడు రాజు వెడ్స్ భవాని వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకలకు తిరుపతిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వారికి వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, గోడల రాంరెడ్డి, నారాయణరెడ్డి, కుమ్మరి నాగప్ప, మదనసింహారెడ్డి , మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం ఆసుపత్రి నుంచి మహిళ అదృశ్యం

హయత్ నగర్, నవంబర్ 15 (జనం సాక్షి)వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి పాలడుగు అండాలమ్మ (56) అదృశ్యమైంది. అనారోగ్యంతో నవంబర్ 14న ఉదయం ఆసుపత్రికి తీసుకెళ్లగా, బంధువు మందుల కోసం వెళ్లి తిరిగి వచ్చే సరికి కనిపించకుండా పోయింది. ఆమెకు మతిస్థిమితం సరిగా లేదని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుర్తులు: ఎత్తు 5.5 అడుగులు, ఛామన ఛాయ, ఎరుపు రంగు నైటీ ధరించింది. ఆచూకీ తెలిసిన వారు 8712662637, 8712662300, 8712662275 నంబర్లకు సమాచారం ఇవ్వాలని వనస్థలిపురం ఎస్ హెచ్ ఓ రవిబాబు తెలిపారు.



మంత్లీ సీజన్ టికెట్ ప్రయాణికులకు ప్రత్యేక రాయితీలు

డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్



తాండూరు నవంబర్ 15(జనంసాక్షి)తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తాండూర్ డిపో పరిధిలో మంత్లీ సీజన్ టికెట్ ప్రయాణికులకు పలు ప్రత్యేక రాయితీలు, సదుపాయాలు కల్పిస్తున్నట్లు తాండూర్ డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.దూర పరిమితి లేకుండా టికెట్లు జారీ చేయడంతో పాటు టోల్ ఛార్జీలపై రాయితీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, ఈ-డీలక్స్ బస్సుల్లో ప్రయాణ సౌకర్యం, ఎంపిక చేసిన నగరాల్లో ఆదివారం ఉచిత ప్రయాణం, రూ.20తో కాంబి టికెట్ సదుపాయం అందుబాటులో ఉందన్నారు .అలాగే సూపర్ లగ్జరీ, ఆపై కేటగిరీ బస్సుల్లో 10 శాతం రాయితీతో పాటు రెండు నెలల పాస్‌పై 5 రోజులు, మూడు నెలల పాస్‌పై 10 రోజుల అదనపు వ్యాలిడిటీ కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు టోల్ ఛార్జీల్లో ప్రత్యేక రాయితీ ఉందని పేర్కొన్నారు.ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, నిత్యం ప్రయాణించే ప్రయాణికులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు తాండూర్ డిపోను సంప్రదించాలని డిపో మేనేజర్ కోరారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జ్



పూడూర్ నవంబర్15 జనం సాక్షి: పరిగి నియోజకవర్గంలో పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జ్ శ్రీ మారుతి కిరణ్ బూనేటిపరిగి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన వివాహ వేడుకల్లో బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మారుతి కిరణ్ బూనేటి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారుఈ సందర్భంగా నూతనదంపతులకు వైవాహిక జీవితంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొని నూతన వధూవరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ధరూర్ జాతరకు తాండూర్ డిపో నుండి ప్రత్యేక బస్సులు

డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్



తాండూరు నవంబర్ 15(జనంసాక్షి)ధరూర్ జాతరకు వెళ్లే భక్తులు మరియు ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తాండూర్ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు తరలివచ్చే భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అందుకు అనుగుణంగా అదనపు బస్సులను నడపడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకర ప్రయాణాలు చేసే బదులు, సురక్షితమైన మరియు సౌకర్యవంతమైన ఆర్టీసీ బస్సు సేవలను వినియోగించుకోవాలని కోరారు.భక్తులు మరియు ప్రయాణికులు ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక ఇబ్బందితో రైతు మృతి



షాబాద్, నవంబర్ 15(జనం సాక్షి); ఆర్థిక ఇబ్బందులు తాళలేక రైతు మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. షాబాద్ ఇన్స్పెక్టర్ విజయ్ తెలిపిన వివరాల మేరకు ఆదివారం మండల పరిధిలోని బోడం పహాడ్ కు చెందిన చర్లగూడెం వెంకటయ్య (45) భార్య వరలక్ష్మితో కలిసి పొలం పనులకు వెళ్లి పనులు నిర్వహిస్తూ కొద్ది దూరంలో ఉన్న చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.

శాంతినగర్ పార్క్ లో వెలిగిన నూతన ఐమాక్స్ లైట్లు

కాలనీవాసుల్లో హర్షం



తాండూరు నవంబర్ 15(జనంసాక్షి) తాండూరు పట్టణంలోని వార్డ్ నెంబర్ 28 శాంతినగర్ పార్క్ లో పాత లైట్లను తొలగించి నూతన ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేసి శనివారం ఆన్ చేయడం జరిగింది. వార్డ్ కౌన్సిలర్ నాగారం మల్లేశం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ నాగారం మల్లేశం మాట్లాడుతూ శాంతినగర్ పార్క్ లో చాలా కాలంగా లైట్ల సమస్య ఉండేది. పాత లైట్లు తీసేసి నూతన ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు అందరూ చాలా హ్యాపీగా ఫీల్ అవుతున్నారు. పార్క్ అభివృద్ధి ఇంకా కొంత మిగిలి ఉంది. దానిని కూడా త్వరితగతిన అభివృద్ధిలోకి తెచ్చి శాంతినగర్ పార్క్ ను కాలనీవాసులందరికీ అందుబాటులోకి తీసుకొచ్చి అందరి మన్ననలు పొందుతాం" అని అన్నారు.ఈ అభివృద్ధి పనుల కు సహకరించిన మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ గారికి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి గారికి కౌన్సిలర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో 28వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జమీర్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసం వేళ అనంతగిరిలో భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

ఆలయ ఈవోతో చర్చించిన జిల్లా అధ్యక్షులు యు. రమేష్ కుమార్



తాండూరు నవంబర్ 15(జనంసాక్షి) కార్తీక మాసం సందర్భంగా అనంతగిరి శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్ల గురించి జిల్లా అధ్యక్షులు యు. రమేష్ కుమార్ దేవాలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో స్వామివారి దర్శనానికి వేలాది మంది భక్తులు తరలివస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, క్యూలైన్లు, వాహనాల పార్కింగ్, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి" అని దేవాలయ ఈవో దృష్టికి తీసుకెళ్లారు.ఆలయ ఈవో తో చర్చించి, భక్తుల సౌకర్యం కోసం తీసుకోవాల్సిన చర్యలపై వివరంగా మాట్లాడారు. భక్తులు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మరియు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

శంకర్ రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



తాండూరు నవంబర్ 15(జనంసాక్షి) హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డిని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి (బీఎంఆర్) పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎంఆర్ మాట్లాడుతూ శంకర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నాను. వారు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షిస్తున్నాను. వారికి మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని వైద్యులను కోరాను" అని తెలిపారు.

నేడు రెండు గంటల పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపుతో అంతరాయం

జవహర్ నగర్: నవంబర్ 15 (జనంసాక్షి):జవహర్ నగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం (నవంబర్ 16) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 33/11 కేవీ సీఆర్పీఎఫ్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ చెన్నాపూర్ ఫీడర్‌పై అత్యవసర మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నట్లు బాలాజీనగర్ ఏఈ (ఆపరేషన్) హెచ్. సాంబశివరావు తెలిపారు. అత్యవసర సమాచారం కోసం 8712471626 లేదా ఎఫ్‌ఓసీ నంబర్ 8712471677ను సంప్రదించాలని సూచించారు.